సంస్కృతి, కరుణ, సృజనాత్మకతకు నిలయం కోవై



ప్రజలకు ప్రధాని అభివాదం

● ప్రకృతి వ్యవసాయానికి దిశా నిర్దేశం
● వ్యవసాయ సదస్సులో కొనియాడిన ప్రధాని మోదీ

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, కరుణ, సృజనాత్మకతకు కోయంబత్తూరు నిలయమని, దక్షిణ భారత వ్యవస్థాపక శక్తికి కేంద్రంగా వుందని, మాజీ పార్లమెంటు సభ్యుడు సీపీ రాధాకృష్ణన్ ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా దేశానికి మార్గనిర్దేశం చేస్తున్నందున కోయంబత్తూరు మరింత గుర్తింపు పొందిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. కోవైలో ప్రారంభమైన వ్యవసాయ సదస్సు దేశంలోని ప్రకృతి వ్యవసాయానికి దిశానిర్దేశం చేస్తుందని వ్యాఖ్యానించారు. కోవైలోని కొడీసియా మైదానంలో దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ సదస్సును ప్రధాని నరేంద్రమోదీ బుధవారం మధ్యాహ్నం ప్రారంభించారు. గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి ఎస్పీ వేలుమణి, రైతు సంఘాల సమాఖ్య నాయకుడు పీఆర్ పాండ్యన్ తదితరులు పాల్గొన్న ఈ సదస్సులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటైన 17 స్టాళ్లను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతులతో మాట్లాడారు. అనంతరం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' కింద రైతులకు 21వ విడతగా రూ.18 వేల కోట్లు విడుదల చేశారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో విశిష్ట సేవలందించిన పది మంది రైతులకు ప్రధాని అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కోవై నగర వస్త్ర రంగం జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతోందని ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయం తన హృదయానికి చాలా దగ్గరగా వున్న అంశమని వివరిస్తూ.. దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ సదస్సు నిర్వహణకు పూనుకున్న తమిళనాడులోని రైతు సోదరులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశ్రమల భాగస్వాములు, స్టార్టప్ ఆవిష్కర్తలందరినీ ప్రత్యేకంగా అభినందించారు.


ప్రధాని కారుపై పూల వర్షం

ముగిసిన ప్రధాని పర్యటన

ఒక్కరోజు పర్యటన కోసం బుధవారం మధ్యాహ్నం పుట్టపర్తి నుంచి కోయంబత్తూరు చేరుకున్న ప్రధానికి గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, రాష్ట్ర మంత్రి ఎస్పీ వేలుమణి, బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షులు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, అన్నామలై, టీఎంసీ అధినేత జీకే వాసన్ తదితరులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. మళ్లీ ప్రధానికి వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలో ఎడప్పాడి ప్రధానితో కొద్దిసేపు చర్చించినట్లు తెలిసింది. కాగా ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. విమానాశ్రయం నుంచి సదస్సు జరిగిన కొడీసియా మైదానం వరకు రోడ్డుకిరువైపులా నిలబడిన ప్రజలు, బీజేపీ కార్యకర్తలు ప్రధానికి స్వాగతం పలికారు. పలుచోట్ల ప్రధాని వాహనంపై పుష్పవర్షం కురిపించారు.

'కిసాన్ క్రెడిట్ కార్డ్' (కేసీసీ) పథకం ద్వారా మాత్రమే ఈ ఏడాది రైతులకు రూ10 లక్షల కోట్లకు పైగా సహాయం అందిందన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 21వ విడత దేశవ్యాప్తంగా రైతులకు రూ.18,000 కోట్లు బదిలీ అయిందని, తమిళనాడులోని లక్షలాది మంది రైతులు కూడా వారి ఖాతాల్లో నిధులు అందుకున్నారని ఆయన వివరించారు. భారత ప్రభుత్వం రైతులను ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సహిస్తోందని గుర్తుచేస్తూ.. గత ఏడాది కేంద్రం ప్రకృతి వ్యవసాయంపై జాతీయ మిషన్ ప్రారంభించిన విషయాన్ని వివరించారు. తమిళనాట మాత్రమే 35వేల హెక్టార్లలో ఇప్పుడు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం జరుగుతోందన్నారు. శిఖరాగ్ర సమావేశం దేశంలో సహజ వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని, ఈ వేదిక నుండి కొత్త ఆలోచనలు, పరిష్కారాలు ఉద్భవిస్తాయని ప్రధాని ఆకాంక్షించారు.


మోదీని సత్కరిస్తున్న రైతులు


ప్రధానికి స్వాగతం పలుకుతున్న నేతలు

నగరానికి కొత్తరూపు రానుందా ?

పాతికేళ్ల తరువాత... ఎయిర్ టాక్సీలు, వాటర్ మెట్రో, ట్రామ్‌లు



చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల తర్వాత రాజధాని నగరం చెన్నై రూపురేఖలు గుర్తుపట్టలేనంతగా మారబోతున్నాయి. నగరంపై ఎయిర్ టాక్సీలు తిరుగబోతున్నాయి. నగరం నుండి మహాబలిపురం వరకు వాటర్ మెట్రో పేరుతో సముద్రగర్భంలో నడిచే రైలు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. వీటన్నింటికితోడుగా మళ్లీ నగరంలో మినీ బస్సులుగా పిలిచే ట్రామ్‌లు పరుగులు పెట్టనున్నాయి. ఈ రవాణా సదుపాయాల రూపకల్పనకు సంబంధించి చెన్నై ఇంటిగ్రేటెడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రభుత్వానికి ఓ సమగ్రమైన నివేదిక కూడా సమర్పించింది. అందులో కొత్త మెట్రోలైన్లు, వాటర్ మెట్రో సర్వీసులు, ట్రామ్ సర్వీసు, నియో మెట్రో సర్వీస్ వంటి వివిధ ప్రాజెక్టులున్నాయి. చెన్నై మెట్రోపాలిటన్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులో మారుతున్న కాలానికనుగుణంగా మార్పులు తీసుకురావాలని, అందుకు తగినట్లు వివిధ ప్రాజెక్టులను అమలు పరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే చెన్నై ఇంటిగ్రేటెడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి 2023లోనే పనులు ప్రారంభించింది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టుల రూపకల్పనలు తుదిదశకు వచ్చాయి. ఈ ప్రాజెక్టులన్నీ 2048లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగ్గట్లుగానే కీలకమైన ఏడు ప్రాజెక్టులను వీలైనంత త్వరగా అమలు పరచాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కీలకమైన 7 ప్రాజెక్టులు..

- బకింగ్‌హామ్ కాలువ గుండా చెన్నై సెంట్రల్ నుండి కోవలం మీదుగా మహాబలిపురం వరకు 55 కి.మీ. మేర వాటర్ మెట్రో పథకం అమలు
- కాంచీపురం తిరువళ్లూరు - మాంబేడు మీదుగా శ్రీపెరుంబుదూరుకు, ఎన్నూరు - సింగపెరుమాళ్ మధ్య సబర్బన్ రైళ్లు
- తాంబరం -అడయారు, పెరుంగళత్తూరు - మాదవరం (బైపాస్ రోడ్డు) వరకు కొత్త మెట్రో రైలు మార్గం నిర్మాణం. ఈ పథకం పూర్తయితే మొత్తం 400 కి.మీ మెట్రోరైలు మార్గం ఉన్న రాజధాని నగరంగా చెన్నై గుర్తింపు పొందనుంది.
- కోయంబేడు - పూందమల్లి, పల్లావరం - కుండ్రత్తూరు, వండలూరు - కిలాంబాక్కం మార్గాల్లో నియో మెట్రోరైలు సేవలు.
- టి.నగర్ - నుంగంబాక్కం, నందనం - లైట్ హౌస్ మధ్య ట్రామ్ సేవలు
- చెన్నై హార్బర్ - పరందూరు, మహాబలిపురం - తిరుపతి మధ్య గంటలకు 240 కి.మీ. వేగంతో పయనించే ఎయిర్ టాక్సీ సేవలు
- చెన్నై నగరంలో 346 కొత్త బస్టాపులు, 30 కొత్త బస్ డిపోల ఏర్పాటు

కోవై, మదురై మెట్రోలకు అనుమతి నిరాకరణ కక్ష సాధింపే
● కేంద్రంపై సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు, మదురై నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజానీకం బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించడం వల్లే కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఈ రెండు ప్రాజెక్టులను అనుమతి నిరాకరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు స్టాలిన్ బుధవారం తన ఎక్స్ పేజీలో విడుదల చేసిన లేఖలో... ఆలయాల నగరం మదురై, దక్షిణభారత మాంచెస్టర్‌గా పేరుగడించిన కోయంబత్తూరు నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతివ్వలేమంటూ కేంద్రం ప్రకటించడం గర్హనీయమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ద్వితీయ శ్రేణి నగరాల్లో మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతిచ్చి, ప్రతిపక్ష పార్టీ పాలిస్తోందన్న ఏకైక కారణంగా కోయంబత్తూరు, మదురై నగరాల్లో మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతి నిరాకరించడం సబబు కాదని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తోందని, ఇదంతా ఫెడరల్ రాజ్యాంగానికి విరుద్ధమని స్టాలిన్ పేర్కొన్నారు. చెన్నై నగరంలోనూ రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టుకు కూడా కేంద్రం ఇదే రీతిలో అనుమతివ్వకుండా కాలయాపన చేసిందని, అయితే తమ ప్రభుత్వ చర్యలకు తలొగ్గి ఆ ప్రాజెక్టు అనుమతిచ్చిందన్నారు. అయితే నిధులు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తాను ప్రకటించిన తర్వాతే కేంద్రం నిధులు విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం కోయంబత్తూరు, మదురై నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతించమని చెబుతూ మొండి వైఖరి అవలంభిస్తోందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకంజ వేసే ప్రసక్తే లేదని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆ రెండు నగరాల్లో మెట్రోరైలు ప్రాజెక్టులను అమలు చేసి తీరుతామని ఆయన శపథం చేశారు. ఇదిలా వుండగా బుధవారం సీపీఐ అగ్రనేత డి.రాజా సీఎం స్టాలిన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీలో డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులు కూడా పాల్గొన్నారు


సీఎంతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సీపీఐ అగ్రనేత డి.రాజా

జనాభా సాకుతో నిరాకరణ?

కోయంబత్తూరు, మదురై నగరాలలో తగిన జనాభా లేకపోవడంతో మెట్రోరైలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి నిరాకరించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ రెండు నగరాల జనాభా 20లక్షల కంటే తక్కువగా ఉన్నట్లు కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించిందని, ఆ మేరకే ఆ నగరాలలో మెట్రోరైలు ప్రాజెక్టు అమలుకు అనుమతివ్వలేదని చెబుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కోయంబత్తూరు 15.84లక్షల మంది ఓటర్లు, మదురైలో 15 లక్షల మంది మాత్రమే నివసిస్తున్నారు. ఈ కారణాల వల్లే ఆ రెండు నగరాలలో మెట్రోరైలు ప్రాజెక్టుల అమలుకు కేంద్రం అనుమతి నిరాకరించినట్లు తెలుస్తోంది.

పగబట్టిన ప్రేమోన్మాదం
రామేశ్వరంలో విద్యార్థిని దారుణ హత్య ● యువకుడి అరెస్టు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరంలో తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో ప్లస్-2 చదువుతున్న బాలికను ఓ యువకుడు మద్యం మత్తులో దారుణంగా హత్య చేయగా, ఆ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. రామేశ్వరం సేరాంకోట మత్స్యకారుల కాలనీకి చెందిన మారియప్పన్ కుమార్తె షాలిని (17) బాలికోన్నత పాఠశాలలో ప్లస్-2 చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన మునిరాజ్ అనే యువకుడు కొన్ని రోజులుగా షాలినిని స్కూలుకు వెళుతున్నప్పుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. అతడి వేధింపులు భరించలేక షాలిని రెండు రోజుల క్రితం ఆ యువకుడిని తనను వెంబడించవద్దని తీవ్రంగా మందలించింది. దీంతో బుధవారం ఉదయం షాలిని స్కూలు వెళ్తుండగా మునిరాజ్ వెంబడించాడు. దారిలో వేటకొడవలితో దాడి చేసి, గొంతు కోయడంతో పాటు శరీరమంతా తూట్లు పొడిచాడు. రక్తపు మడుగులో పడిన విద్యార్థినిని స్థానికులు వెంటనే రామేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ సంఘటనపై పోలీసు లు కేసు నమోదు చేసుకుని మునిరాజ్‌ను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనను ఖండిస్తూ షాలిని కుటుంబీకులు, బంధువులు, స్థానికులు ధర్నా చేయడంతో రామేశ్వరం - మదురై రహదారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


షాలిని (ఫైల్‌ఫొటో)

ఈపీఎస్, అన్బుమణి ఖండన...

రామేశ్వరంలో విద్యార్థిని దారుణహత్యను ఖండిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పాట్టాలి మక్కల్ కట్చి నాయకుడు డాక్టర్ అన్బుమణి ప్రకటనలు జారీ చేశారు. డీఎంకే పాలనలో స్కూలుకు వెళ్లే బాలికలకు కూడా రక్షణ లేదని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతూనే ఉన్నా ముఖ్యమంత్రి స్టాలిన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గర్హనీయమన్నారు.


నిందితుడు మునిరాజ్


ఆందోళన చేస్తున్న విద్యార్థిని కుటుంబీకులు, బంధువులు

నగరంలో 10 లక్షల ఓట్ల గల్లంతు?
● ప్రతి బూత్‌లో అడ్రస్ మారిన 300 మంది తొలగింపు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో సుమారు 10 లక్షల మంది ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి బూత్‌లోనూ అడ్రస్ మారిన ఓటర్లు 300 మంది వరకు ఉన్నారని గుర్తించడంతో సవరణ పనుల్లో తీవ్ర చిక్కులు ఏర్పడతాయని అధికారులు తెలిపారు. ఈ నెల నాలుగున ప్రారంభమైన ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పనులు మందకొడిగానే జరుగుతున్నాయి. రాష్ట్రమంతటా ఈ సవరణ పనుల కోసం ముద్రించిన 6.41 కోట్ల దరఖాస్తులను ఓటర్లకు అందజేశారు. ఆ దరఖాస్తు ఎలా పూర్తి చేయాలో తెలియక ఓటర్లంతా తలపట్టుకుంటున్నారు. నగరంలో 40 లక్షలకు పైగా ఓటర్లున్నారు. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియంలో బీఎల్వోల పరిశీలనలో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 200 నుండి 300 మంది వరకు ఓటర్లు వేరే నియోజకవర్గాల్లో నివసిస్తున్నట్లు తేలింది. ఆ ప్రాకారం సుమారు 10లక్షల మంది ఓటర్లు వేర్వేరు చిరునామాల్లో నివసిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి బూత్ వద్ద 60 శాతం మంది ఎన్నిలక సంఘం సిబ్బంది ఇచ్చే దరఖాస్తులను సులువుగా నింపగలుగుతున్నారు. తక్కిన 40 శాతం మంది ఆ ఫారాలను ఎలా పూర్తి చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇక అడ్రస్‌లు మారిన ఓటర్లంతా ప్రస్తుతం తాము నివసిస్తున్న నియోజకవర్గంలో ఓటు హక్కు పొందటానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు: ముగ్గురు మెడికోల మృతి

ఫోటో చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సముద్రతీర రహదారిలో మంగళవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్యవిద్యార్థులు మృతి చెందారు. తూత్తుకుడి ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఓ కారులో వెళ్తుండగా ఉన్నట్టుండి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణించిన వైద్య విద్యార్థులు ముకిలన్, రాహుల్ సెబాస్టిన్, సారూబన్ అనే ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను కారు శిథిలాల మధ్య నుండి వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు.


ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

సమాచార దర్శిని

'టెట్'కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2026 జనవరి 23,25 తేదీల్లో టెట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ నియామక బోర్డు (టీఆర్బీ) విడుదల చేసిన ప్రకటనలో... టెట్‌లో ఉత్తీర్ణులు కాని ఉపాధ్యాయులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు గురువారం నుంచి డిసెంబరు 20వ తేది వరకు www.trb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవలని తెలిపింది. అలాగే, 2025 సెప్టెంబరు 1వ తేదీకి ముందు నియమితులైన ఉపాధ్యాయులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని టీఆర్బీ తెలిపింది.

'తమిళ భాషా సాహిత్య' ఫలితాల విడుదల

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గుర్తింపు పొందిన పాఠశాలల్లో (సీబీఎస్ఈ, ఐసీఎస్‌సీ సహా) ప్లస్ వన్ చదువుతున్న విద్యార్థులకు 2022 నుంచి తమిళ భాషా సాహిత్య అప్టిట్యూట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో 1,500 మంది విద్యార్థులను ఎంపిక చేసి, రెండేళ్ల పాటు ప్రతినెలా రూ.1,500 ప్రోత్సాహకం అందజేస్తున్నారు. ఇందులో 50 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, మిగిలిన 50 శాతం ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది అప్టిట్యూడ్ పరీక్ష అక్టోబరు 11వ తేది నిర్వహించగా, 2.57 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలను www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఫలితాల్లో ఏవైనా సవరణలు ఉంటే గురువారం (ఈరోజు) సాయంత్రం 5 గంటల్లోపు dgedsection@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాలో తెలియజేయాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు గిండిలో జాబ్ మేళా

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి ఆలందూర్ రోడ్డు సమీపంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో సుమారు 20కి పైగా సంస్థలు పాల్గొని, తమకు అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 8వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు శిబిరంలో పాల్గొనవచ్చు. అలాగే, తమ దరఖాస్తులు www.tnprivatejobs.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు.

'సీమెట్' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలోని ఉన్నత విద్యా సంస్థలు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి కామన్ అడ్మినిస్ట్రేటివ్ ఎంట్రన్స్ టెస్ట్ (సీఎంఈటీ) నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ పరీక్ష నిర్వహించనుండగా, 2025-26 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు జనవరిలో సీమెట్ నిర్వహించనున్నారు. ఈ పరీక్ష దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్‌లో గత నెల 17న ప్రారంభమై ఈ నెల 17వ తేదీతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెల 24వ తేది వరకు పొడిగించారు. ఆసక్తి కలిగిన గ్రాడ్యుయేట్లు https://cmat.nta.nic.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి., పరీక్ష ఫీజు ఈ నెల 25వ తేది వరకు చెల్లించవచ్చు. దరఖాస్తుల లోపాల సవరణకు ఈ నెల 26 నుంచి 28వ తేది వరకు అవకాశం కల్పించారు. మరిన్ని వివరాలకు www.nta.ac.in అనే వెబ్‌సైట్, 011-40759000 అనే ఫోన్ నెంబరు, cmat@nta.ac.in అనే ఈ-మెయిల్ ద్వారా పొందవచ్చు.

పాఠశాలలకు 22 అడుగుల రోడ్డు తప్పనిసరి

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి పాఠశాలలున్న రహదారుల్లో రద్దీ లేకుండా పాఠశాలల విభాగానికి కొన్ని సవరణలు చేశారు. ఆ ప్రకారం, జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి ఉన్న పాఠశాల ప్రాంగణాల ఏర్పాటుకు 22 అడుగుల సర్వీస్ రోడ్డు తప్పనిసరి చేశారు. రహదారి నుంచి సర్వీస్ రోడ్డుకు వాహనాలు వెళ్లడం, నిష్క్రమించడానికి దారులు ఏర్పాటుచేయాలి. ఈ ప్రవేశ ద్వారాలు 29 అడుగుల నుంచి 39 అడుగుల వెడల్పులో ఉండాలి. ఇందులో, రహదారి, సర్వీస్ రోడ్డు మధ్య డివైడర్లు 3 అడుగుల ఎత్తు ఉండాలని నిబంధనలు సవరించారు.

గ్రూప్-2, 2ఏ పోస్టుల పెంపు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2,2ఏ పోస్టులను పెంచుతున్నట్లు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) తెలిపింది. ఈ విషయమై టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 645 గ్రూప్-2, 2ఏ పోస్టుల భర్తీకి జూలైలో నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపింది. ఈ క్రమంలో, ప్రస్తుతం ఖాళీ పోస్టుల సంఖ్య మరో 625 పెరగడంతో, మొత్తం 1,270 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. ఈ పోస్టులు మరింత పెరిగే అవకాశముందని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

కోవైలో మోదీ పర్యటన..

నల్లజెండాలతో రైతుల నిరసన

● 90 మంది అరెస్టు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ కోయంబత్తూరులో జరిగిన ప్రత్యేక రైతు సదస్సుకు హాజరుకావడానికి నిరసనగా రైతులు అక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం ధర్నా జరిపారు. వివిధ రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ జన్యుపరంగా మార్పు చెందిన విత్తనాలను అభివృద్ధి చేయడానికి రూ.500 కోట్ల మేరకు నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి సేంద్రియ రైతుల సదస్సులో పాల్గొనే హక్కులేదన్నారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం దక్షిణాది నదుల అనుసంధానం ప్రాజెక్టును అమలు చేయకుండా పదేళ్లుగా పెండింగ్‌లో ఉంచడం గర్హనీయమన్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న రైతునాయకులు సహా 90 మందిని అరెస్టు చేశారు.

తిరుప్పూరులో నిరసన...

ఇటీవల బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో తమిళనాట బీహార్ కార్మికులను డీఎంకే నాయకులు, కార్యకర్తలు వేధిస్తున్నారంటూ అసత్య ప్రచారం చేయడానికి నిరసనగా ఆదితమిళర్ పేరవై ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. ఈ సందర్భంగా అవినాశి పోలీసులు జోక్యం చేసుకుని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి విడుదలై సెల్వం తదితరులను అరెస్టు చేశారు. ఇదే విధంగా కోవైలో ప్రధాని మోదీ



కోయంబత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల జెండాలతో ధర్నా చేస్తున్న రైతులు

పర్యటనను వ్యతిరేకిస్తూ ముర్పోక్కు ఇయక్కమ్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ముప్పై మందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన కారణంగా ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రైలు పట్టాలపై సిమెంటు దిమ్మెతో 'రీల్స్'

● ఐదుగురు బిహారీల అరెస్ట్

పెరంబూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రైలు పట్టాలపై సిమెంటు దిమ్మె ఉంచి రీల్స్ చేసిన ఐదుగురు బిహారీలను పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై-కారైకుడి పల్లవన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9వ తేది ఓలక్‌సూర్-దిండివనం మధ్య వెళ్తుండగా ఇంజన్ దాటిన వెంటనే శబ్దం వచ్చింది. లోకో ఫైలట్ వెంటనే రైలు నుంచి దిగి పరిశీలించగా, ముందు చక్రంలో పగుళ్లను గమనించారు. ఆ చక్రానికి మరమ్మతుల అనంతరం బయల్దేరింది. ఈ వ్యవహారంపై రైల్వే పోలీసులు చేపట్టిన విచారణలో, బిహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు యువకులు రైలుపట్టాలపై సిమెంట్ దిమ్మె ఉంచి రీల్స్ చేసినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన రైల్వే పోలీసులు వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి 15 ఏళ్ల జైలుశిక్ష

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ సమీపంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన 60 ఏళ్ల వృద్ధుడికి న్యాయస్థానం 15 ఏళ్ల జైలుశిక్ష విధించింది. మైలాపూర్ ప్రాంతంలో నేపాల్‌కు చెందిన దంపతులు, తమ ఆరేళ్ల కుమార్తెతో కలసి జీవిస్తున్నారు. మార్చిలో అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ సాలిప్రాణ్ (60) అనే వృద్ధుడు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మైలాపూర్ మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి సయ్యద్ సాలిప్రాణ్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు చెన్నై పోక్సో కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నేరారోపణ నిరూపణ కావడంతో సయ్యద్ సాలిప్రాణ్‌కు 15 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎస్.పద్మ మంగళవారం తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికకు పరిహారంగా రూ.1.5 లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

వేలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) స్థానిక కొనపేట ప్రాంతం తిరుమలై వీధి ప్రాంతానికి చెందిన బాలకృష్ణన్ ఓ బీమా సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ నెల 15వ తేది బాలకృష్ణన్ ఇంటికి వచ్చి చూడగా, ఇల్లంతా చిందరవందరగా ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని 25 సవర్ల నగలు, రూ.1.60 లక్షల నగదు చోరీకి గురయ్యాయని గుర్తించాడు. బాలకృష్ణన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలన అనంతరం, తిరుచెందూర్ ప్రాంతానికి చెందిన ప్రభాకరన్ ను అరెస్ట్ చేసి, అతని నుంచి 25 సవర్ల నగలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

కోడిగుడ్ల లారీ బోల్తా



బోల్తాపడిన లారీ


తిరుత్తణి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలో కోడిగుడ్ల లారీ బోల్తాపడడంతో 2 లక్షల గుడ్లు పగిలిపోయాయి. అత్తిమాంజేరిపేటకు కోడిగుడ్ల లోడుతో బుధవారం తెల్లవారుజామున వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుపై ఒరిగి పడింది. ఈఘటనలో లారీలో ఉన్న సుమారు 2 లక్షల కోడిగుడ్లు ట్రాక్‌లు నేలపై పడ్డాయి. కిందపడిన కోడిగుడ్లను స్థానికులు సంచుల్లో ఎత్తుకెళ్లారు. పొదటూరుపేట పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

యువకులపై దాడి... దోపిడీ

● ఆటో డ్రైవర్ సహా ముగ్గురి అరెస్టు

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులో ఇద్దరు యువకులపై దాడి చేసి వారి దగ్గరున్న మొబైల్ ఫోన్లు, నగదు దోపిడీ చేసిన కేసులో ముగ్గురు ఆటో డ్రైవర్లను నగర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కథనం మేరకు... రామనాథపురంకు చెందిన మహ్మద్ అబ్దుల్లా తన స్నేహితుడు పుదుక్కోటకు చెందిన ఇమాముదీన్‌తో కలిసి కోయంబేడులో అద్దెకు ఉంటూ ఉద్యోగం చేస్తున్నారు. వీరిద్దరూ సొంతూరు వెళ్లేందుకు మంగళవారం కోయంబేడు బస్టాండుకు బయలుదేరారు. ఇంతలో ఒక ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు వీరిని కత్తితో బెదిరించి ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి వారివద్ద ఉన్న రూ.7,500 నగదు, రెండు మొబైల్ ఫోన్లను దోచుకుని వదిలిపెట్టారు. దీనిపై బాధితులు కోయంబేడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అరుంబాక్కంకు చెందిన శంకర్ , కొరట్టూరుకు చెందిన ఇబ్రహీం ఖాన్, అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీకి చెందిన కార్తిక్ లుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. వీరిలో కార్తిక్‌పై 2023లోనే దోపిడీ కేసు కోయంబేడు పోలీస్ స్టేషన్‌లో నమోదైనట్లు గుర్తించారు. వీరి నుంచి రెండు ఆటోలు, కత్తి, రూ.7,500 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగభూషణం, పాన్ కృష్ణమూర్తి తదితరులు

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఇందిరమ్మ చిత్రపటానికి మాజీ ఎంపీ పీటర్ అల్ఫోన్స్, ఉపాధ్యక్షులు స్వర్ణా సేతురామన్, ప్రధాన కార్యదర్శి తమిళ్ సెల్వన్, మహిళా నేతలు నివాళులర్పించారు. అదే విధంగా, మూలై ప్రాంతంలో ఉన్న ఇందిరమ్మ విగ్రహం వద్ద కాంగ్రెస్ సర్కిల్ అధ్యక్షులు, న్యాయవాది సీబీ నరేష్‌కుమార్ అధ్యక్షతన పార్టీ సీనియర్ నేత పాన్ కృష్ణమూర్తి, పుల్లాపురం ఆది ఆంధ్ర ఇందిరా సేవా సంఘం అధ్యక్షులు ఐరకట్ల నాగభూషణం, గొల్లపల్లి గోపీ, ఎస్.సాల్మన్ రాజు, సి.మాలకొండయ్య, చెంచల చార్మి తదితరులు పూలు చల్లి నివాళులర్పించారు. పిల్లలు, స్థానికులకు స్వీట్లు పంపిణీ చేసి, సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు.

రేషన్ దుకాణాల్లో రాయితీపై శానిటరీ నాప్‌కిన్లు

● ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో శానిటరీ నాప్‌కిన్స్ రాయితీ ధరకు, ఉచితంగా అందజేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై డిసెంబరు 16వ తేదిలోగా అఫిడవిట్ దాఖలుచేయని పక్షంలో, ఆరోగ్యశాఖ సహా మూడు శాఖల కార్యదర్శులు హాజరుకావాల్సి ఉంటుందని మద్రాసు హైకోర్టు హెచ్చరించింది. తాంబరంకు చెందిన న్యాయవాది లక్ష్మీరాజా మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... మహిళలకు అవసరమైన శానిటరీ నాప్‌కిన్స్ అధిక ధరకు విక్రయిస్తుండంతో, పేద మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాఠశాలల్లో ఉచితంగా నాప్‌కిన్స్ అందించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఆ ఉత్తర్వులు మహిళల ఆరోగ్య అవసరాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ కారణంగా, రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో శానిటరీ నాప్‌కిన్స్ ఉచితంగా, రాయితీ ధరకు అందించే పథకం ఉందా? అని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోగా, అలాంటి పథకం లేదని సమాధానం ఇచ్చారని తెలిపారు. అందువల్ల, పేద, గ్రామీణ మహిళల కోసం రేషన్ దుకాణాల్లో రాయితీ ధరకు, ఉచితంగా శానిటరీ నాప్‌కిన్‌లు అందించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనం విచారించగా, పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. అందుకు ధర్మాసనం, ఇప్పటికే తుది అవకాశం ఇచ్చినా, ఇంతవరకు అఫిడవిట్ దాఖలుచేయలేదని, డిసెంబరు 16వ తేదిలోపు అఫిడవిట్ దాఖలుచేయాలని, లేని పక్షంలో సాంఘిక సంక్షేమ శాఖ, ఆహార సరఫరా శాఖ, ఆరోగ్య శాఖ కార్యదర్శులు నేరుగా విచారణకు హాజరుకావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రధాని పర్యటనకు బాంబు బెదిరింపు

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ కోయంబత్తూరు పర్యటన సందర్భంగా బుధవారం ఉదయం బాంబు బెదిరింపు రావటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బుధవారం ఉదయం పది గంటల సమయంలో ఈమెయిల్‌లో బాంబు బెదిరింపు వచ్చింది. ప్రధాని పర్యటనలో బాంబులు పేలుతాయని గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరించారు. దీంతో ఆ విషయాన్ని అధికారులు జిల్లా కలెక్టర్‌కు, పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్ళి ప్రధాని హాజరుకానున్న కొడీసియా మైదానం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదిదరింపేనని తేల్చడంతో అన్ని వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

వరుస బాంబు బెదిరింపులు

● ఆలస్యంగా బయలుదేరిన విమానాలు

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరుస బాంబు బెదిరింపుల నేపథ్యంలో చెన్నై విమానాశ్రయంలో తనిఖీలను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ కారణంగా పది విమానాలు ఆలస్యంగా బయలుదేరి వెళ్ళాయి. ఇటీవలికాలంలో సినీ, రాజకీయ ప్రముఖుల నివాసాలతో పాటు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ప్రముఖ ఆలయాలకు వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెల్సిందే. దీంతో దేశ వ్యాప్తంగా భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. చెన్నై ఎయిర్‌పోర్టులోనూ భద్రతను పెంచి తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల కారణంగా విమానాలు బయలుదేరే సమయాల్లో కూడా ఆలస్యమవుతోంది. ఇందులోభాగంగా చెన్నై నుంచి జర్మనీ రాజధాని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్ళాల్సిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్, దుబాయ్ వెళ్ళాల్సిన ఎమిరేట్స్ విమానం, సింగపూర్ వెళ్ళాల్సిన ఎయిర్ ఏషియా విమానం, సింగపూర్ ఎయిర్‌లైన్స్, దోహా వెళ్ళాల్సిన ఇండిగో ఫ్లైట్, థాయ్‌లాండ్‌కు వెళ్ళే థాయ్ ఎయిర్‌లైన్స్, షార్జా, అబుదాబీలకు వెళ్ళాల్సిన ఎయిర్ అరేబియన్ ఎయిర్‌లైన్స్, అబుదాబికి వెళ్ళే ఇతిహాద్ విమానం, మస్కట్ వెళ్ళాల్సిన ఓమర్ ఎయిర్‌లైన్స్‌తో సహా మొత్తం 10 విమానాలు ఆలస్యంగా బయలుదేరి వెళ్ళాయి.

కరుడుగట్టిన ముసుగు దొంగల అరెస్టు

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని వణికించిన ఇద్దరు ముసుగు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై 40కుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తూత్తుక్కుడి జిల్లాలోని కోవిల్‌పట్టికి చెందిన పోలీసులు మంగళవారం రాత్రి కోవిల్‌పట్టి నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన ఓ కారు ఆపి తనిఖీ చేయగా, అందులో ఉన్న వారు పొంతన లేని సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత వీరిద్దరిని స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారించగా, రామనాథపురం జిల్లాకు చెందిన శాంతకుమార్, మదురై జిల్లాకు చెందిన శివకుమార్‌గా గుర్తించారు. వీరిద్దరికీ అనేక దోపిడీ, దొంగతనాలతో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. ముఖ్యంగా పేరు మోసిన ముసుగు దొంగలుగా చెలామణి కావడంతో పాటు పోలీసులను సైతం వణికించినట్టు విచారణలో వెల్లడైంది. దీంతో వీరిని అరెస్టు చేసి, కేసు నమోదు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అయ్యప్ప భక్తుల మృతి

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ జిల్లా ఆంబూరు సమీపంలో శబరిమల యాత్ర ముగించుకుని తిరిగొస్తున్న ఇద్దరు అయ్యప్ప భక్తులను వాహనం ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మరణించారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణికి చెందిన అయ్యప్ప భక్తులు ఈ నెల 13న వాహనంలో శబరిమల వెళ్లి, ఇరుముడులు సమర్పించి బుధవారం తిరుగుముఖం పట్టారు. ఆంబూరు సమీపంలోని సెంగిలికుప్పం జాతీయ రహదారిలో బుధవారం ఉదయం వస్తున్న సమయంలో లోడు వాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తిరుత్తణికి చెందిన అయ్యప్ప భక్తులు గంగాధరన్ (35), సూర్య (22) ఘటనా స్థలంలోనే మరణించగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో వాణియంబాడి ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

● ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు.. సీబీఐ విచారణకు తాత్కాలిక స్టే

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసుపై సీబీఐ విచారణకు సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే విధించింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ గత ఏడాది జూలై 5న పెరంబూర్‌లోని తన ఇంటి సమీపంలో దారుణహత్యకు గురయ్యారు. ఈ ఘటనపై సెంబియం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఈ హత్య కేసులో పలు పార్టీలకు చెందిన రాజకీయ నేతలకు సంబంధముందని, అందువల్ల ఈ కేసు సీబీఐ విచారణకు మార్చాలని ఆమ్‌స్ట్రాంగ్ సోదరుడు ఇమ్మానుయేల్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారించిన హైకోర్టు, ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు సీబీఐకి మారుస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు వేసింది. ఈ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం, సీబీఐ విచారణకు ఆదేశించిన ఉత్తర్వులు రద్దు చేసేందుకు నిరాకరించడంతో పాటు ఛార్జిషీటు రద్దు చేయాలన్న ఉత్తర్వులు కూడా నిలిపివేసింది. ఈ నేపథ్యంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు సీబీఐ విచారణకు మారుస్తూ ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ బుధవారం విచారించిన సుప్రీంకోర్టు, సీబీఐ విచారణకు తాత్కాలిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

'సర్' విధుల్లో ఉన్న ఉద్యోగుల రెమ్యునరేషన్ పెంపు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు ఇచ్చే రెమ్యునరేషన్‌ను రాష్ట్రప్రభుత్వం రెండు రెట్లు పెంచింది. రాష్ట్రంలో ఈ నెల 4వ తేది నుంచి ప్రారంభమైన 'సర్' పనులు డిసెంబరు 4వ తేది వరకు జరుగనుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 90 శాతానికి పైగా (సుమారు ఆరు కోట్ల మంది) ఫారాలు అందజేశారు. సర్ విధుల్లో మానసిక ఒత్తిడికి గురవుతున్నామన్న రెవెన్యూ అధికారులు మంగళవారం నుంచి విధులు బహిష్కరిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సర్ విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల రెమ్యునరేషన్ రెండు రెట్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఆ ప్రకారం, బూత్ లెవల్ అధికారుల రెమ్యునరేషన్ రూ.6,000 నుంచి రూ.12,000లకు పెంచారు. అలాగే, సర్ విధుల్లో పాల్గొంటున్నందుకు అందించే ప్రోత్సాహక నిధి రూ.1,000 నుంచి రూ.2,000, పోలింగ్ బూత్ అబ్జర్వర్లకు అందించే రెమ్యునరేషన్ రూ.12,000 నుంచి రూ.18,000 పెరిగింది.

తండలంలో 'జి స్క్వేర్' ప్రాజెక్టు

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'జిస్క్వేర్' సవీతా మెడికల్ కాలేజీ వెనుక వున్న తండలంలో తన ప్రీమియం విల్లా ప్లాట్ కమ్యూనిటీని ప్రారంభించింది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకులు బాల రామజయం ప్రకటన విడుదల చేశారు. పూందమల్లి, శ్రీపెరంబుదూర్ సమీపంలోని వ్యూహాత్మకంగా వున్న ఈ ప్రాజెక్టు తొలి 15 బుకింగ్‌లకు చదరపు అడుగు కేవలం రూ.1,790ల ప్రారంభ ధరతో మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమ్మె బాట పట్టిన సర్వేయర్లు

తిరువళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యల సాధన కోసం సర్వేయర్లు సమ్మె బాట పట్టారు. దీని కారణంగా పట్టాల మంజూరుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తిరువళ్లూరు కలెక్టర్ కార్యాలయంలో సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ఎం సెంథిల్‌కుమరన్ అధ్యక్షతన సర్వేయర్లు నిరవధిక సమ్మెకు దిగారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవిన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణికంఠన్ మాట్లాడుతూ... సర్వే విభాగంలో ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు, రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గించాలి సహా పలు అంశాలతో సమ్మె చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ల సంఘం జిల్లా కార్యదర్శులు శరత్‌కుమార్, యశ్వందర్‌దాస్, ఉపాధ్యక్షురాలు విద్య సహా పెద్దసంఖ్యలో సర్వేయర్లు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సర్వేయర్లు

ఆమె అవయవాలు సజీవం

● ఐదుగురికి పునర్జన్మ ప్రసాదించిన వైద్యురాలు



వైద్యురాలి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు, ఆసుపత్రి నిర్వాహకులు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన వైద్యురాలు, తన అవయవాలతో ఐదుగురికి పునర్జన్మ ప్రసాదించారు. సేలం మారమంగళత్తుపట్టికి చెందిన రోహిణి (25) తేని ప్రభుత్వ వైద్యకళాశాలలో మెడిసిన్ పీజీ చేస్తోంది. ఈ నెల 16న రోడ్డు ప్రమాదంలో గాయపడిన రోహిణిని తేని ప్రభుత్వ కళాశాలలో చేర్పించారు. అనంతరం మదురై మీనాక్షి స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స ఫలించక మంగళవారం డాక్టర్ రోహిణి మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఆమె అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా రోహిణి అవయవాలను వైద్యులు తొలగించి, వాటిని అవసరమైన ఆస్పత్రులకు పంపించారు. డాక్టర్ రోహిణి మృతదేహానికి ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సెల్వరాజ్, తేని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ముత్తుచిత్ర, సహచర వైద్యులు, నర్సులు, సిబ్బంది నివాళులర్పించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, ప్రభుత్వ లాంఛనాలతో డాక్టర్ రోహిణి అంత్యక్రియలు జరిగాయి.

విఘ్నేశ్వరుడికి గజరాజు పూజలు



ఆలయం వద్ద గజరాజు

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అడవిలో నుంచి వచ్చిన ఏనుగు, ఆ ప్రాంతంలోని ఆలయం ముందు నిలబడి తొండెం ఎత్తి కొద్దిసేపు ఉండి వెళ్లే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల శరణాలయంలో చిరుతలు, ఏనుగులు సహా పలురకాల జంతువులున్నాయి. ఆహారం, నీటి కోసం జంతువులు తరచూ జనావాస ప్రాంతాల్లోకి వస్తుంటాయి. ఈ నేపథ్యంలో, అడవి నుంచి బయటకు వచ్చిన ఏనుగు వినాయకుడి ఆలయం వద్ద తొండెం ఎత్తి వంగి ఉన్న దృశ్యం ప్రస్తుతం వైరల్‌గా మారింది. బన్నారి మారియమ్మన్ ఆలయం పక్కనే తింబం పర్వత మార్గం ఉంది. ఈ మార్గంలో ఉన్న వినాయకుడి ఆలయానికి రెండు రోజుల క్రితం వచ్చిన లారీ డ్రైవర్, లారీని పక్కనే ఆపి, ఆలయంలో కొబ్బరి కాయ కొట్టి, కర్పూరం వెలిగించి పూజలు చేశాడు. అనంతరం కొద్దిదూరం వెళ్లి ఓ చెట్టు కింద సేదతీరాడు. ఆ సమయంలో, అడవి నుంచి వచ్చిన ఏనుగును చూపి డ్రైవర్ భయపడ్డాడు. కానీ ఆ ఏనుగు ఆలయం ముందు నిల్చుని తొండెం ఎత్తి కొంచెం వంగి కాసేపు ఉండి తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. ఆ సమయంలో, ఆ ప్రాంతంలో ఉన్న వారికి ఏనుగు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. ప్రస్తుతం ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

ఎంపీ కదిర్ ఆనంద్ నేతృత్వంలో సమావేశం



సమావేశంలో ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలూరు దక్షిణ జిల్లా డీఎంకే ఆర్గనైజర్, ఎంపీ కదిర్ ఆనంద్ నేతృత్వంలో బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాట్పాడిలో జరిగిన సమావేశంలో పార్టీ యువజన విభాగం ఆర్గనైజర్ శ్రీనివాసన్, జిల్లా ఆర్గనైజర్ రాజమారాండం సహా పలువురు నేతలు పాల్గొన్నారు. 2026వ సంవత్సరానికి యువజన విభాగానికి కొత్త నిర్వాహకుల ఎంపిక, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే గెలుపుకు ప్రచారం చేయడం సహా పలు అంశాలపై సమావేశంలో చర్చించినట్లు ఎంపీ కదిర్ ఆనంద్ తెలిపారు.

సాధుకార మఠం ఆధ్వర్యంలో అన్నదానం

వేలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాధుకార మఠంలో ఆధ్యాత్మిక స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో 17 నుంచి 19వ తేది వరకు అన్నదానం చేశారు. ప్రతిరోజు వందమందికి పైగా అన్నదానం చేసినట్లు స్నేహితుల సంఘం నిర్వాహకులు తెలిపారు.

అన్నాడీఎంకేకు పెరుగుతున్న కుల సంఘాల మద్దతు

● మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేకు కుల సంఘాలు, కార్మిక సంఘాల మద్దతు పెరుగుతోందని మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ పేర్కొన్నారు. ఆంగ్లేయుల పాలనలో స్వదేశీ పడవలు నడిపిన స్వాతంత్ర్య సమరయోధుడు వీఓ చిదంబరం వర్థంతిని పురస్కరించుకుని తిరునల్వేలిలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన వెల్లలార్ మున్నేట్ర కళగం మహానాడులో రాజేంద్ర బాలాజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యవహరిస్తున్నారని, కూటమిలో కొత్త పార్టీలను చేర్చుకునే నిర్ణయం ఆయనదేనన్నారు. విజయ్ తమ కూటమిలో చేరాలనుకుంటే, ఈపీఎస్‌ను సంప్రదించవచ్చన్నారు.

వ్యాయామానికి యువత ప్రాధాన్యం ఇవ్వాలి

● ఎమ్మెల్యే కృష్ణస్వామి



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణస్వామి

తిరువళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండి, వ్యాయామం, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి సూచించారు. తిరువళ్లూరు జిల్లాలోని గూడపాక్కం, పున్నపాక్కం, పుల్లరంబాక్కం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన వ్యాయామశాలలను కృష్ణస్వామి బుధవారం ప్రారంబించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల యువత, విద్యార్థులకు చెడు అలవాట్లకు బానిసలుగా మారడం ఆవేదన కలిగిస్తుందన్నారు. అలాగే, రోజంతా సెల్‌ఫోన్ వినియోగిస్తున్నార న్నారు. అలాంటివి మానుకొని పుస్తకాలతో స్నేహం, క్రీడలతో కాలక్షేపం చేయాలన్నారు. శారీరక దారుఢ్యానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చి నాణ్యమైన ఆహారానికి తీసుకోవాలని సూచించారు. డీఎంకే ప్రభుత్వంలో క్రీడల మంత్రిగా ఉదయనిధి, క్రీడాకారులకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పార్టీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంత్ కిషోర్‌లాగే విజయ్‌కీ ఓటమి తప్పదు

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌లాగే తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షులు విజయ్ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అభిప్రాయపడ్డారు. కోవై విమానాశ్రయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీహార్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి చరిత్రలో కనివినీ ఎరుగని విధంగా ఘనవిజయం సాధించిందని, వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్నాడీఎంకే బహిష్కృత నేతలు ఒ.పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్‌లను ఎన్డీఏ కూటమిలో చేర్చుకునే పరిస్థితి కనిపించలేదని, ఎన్నికలకు మరో నాలుగు నెలల సమయం ఉన్నందువల్ల కూటమిలో కొన్ని మార్పులు కూడా జరిగే అవకాశముందన్నారు. కరూర్ ఘటన తర్వాత విజయ్‌కు ప్రాణహాని ఉందని తాను అభిప్రాయం వ్యక్తం చేశానన్నారు. ఈ అభిప్రాయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కాకుండా ఓ సామాన్య వ్యక్తిగా తెలిపానని నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు.

డేనియల్ బాలాజీ చివరి చిత్రం

'జేపీ 180'


షూటింగ్ లొకేషన్‌లో డేనియల్ బాలాజీ తదితరులు

దివంగత నటుడు డేనియల్ బాలాజీ ప్రధాన విలన్ పాత్రలో నటించిన చివరి మూవీ 'జేపీ 180'. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించగా, ఈ నెల 28న విడుదలకానుంది. దర్శకుడు మిష్కిన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన జేపీ ఈ చిత్రానికి దర్శకుడు. హీరోయిన్ తాన్య రవిచంద్రన్. కె.భాగ్యరాజ్, తమిళ్, అరుల్‌దాస్ తదితరులు నటించారు. ఈ ప్రాజెక్టు వివరాలను దర్శకుడు జేపీ వివరిస్తూ, "జేపీ 180' అనేది మెడికల్ ఎమర్జెన్సీ, మానసిక స్థితిని సూచించే కోడ్. మాదకద్రవ్యాల ప్రభావంతో తీవ్రమైన రక్తపోటుతో బాధపడుతూ, మానవ అంతర్గత అవయవాల పనితీరు కుప్పకూలిపోతుంది. ఇలాంటి వారు జంతువుల్లా ప్రవర్తిస్తూ, హింసలకు పాల్పడుతూ, వ్యక్తులను చంపడం, మహిళలపై క్రూరంగా దాడి చేస్తుంటారు. ఈ పాత్రలో డేనియల్ బాలాజీ నటించారు. తాన్య రవిచంద్రన్ అతడికి చికిత్స చేసే వైద్యురాలిగా నటించారు. అత్యంత క్రూరమైన స్వభావం కలిగిన విలన్‌ను సాధారణ మనిషిగా మార్చేందుకు ఆమె అవిశ్రాంతంగా ప్రయత్నిస్తుంది. ఈ దేవదూత... దెయ్యంలా ప్రవర్తించే వ్యక్తిని రక్షించే ప్రయత్నంలో విజయం సాధిస్తుందా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ' అని వివరించారు.

చిత్రజ్యోతి

ఏగన్ సరసన ఇద్దరు హీరోయిన్లు

యువ నటుడు ఏగన్ కథానాయకుడిగా నటించే కొత్త చిత్రం కోసం ఇద్దరు హీరోయిన్లను ఎంపిక చేశారు. వీరిలో ఒకరు తెలుగు యువ నటి శ్రీదేవి 'కోర్ట్ : స్టేటస్ నో బడి' అనే చిత్రంలో నటించి ఈ తమిళ చిత్రంలో ఛాన్స్ అందుకున్నారు. అలాగే, 'బ్రూస్ లీ బిజీ' అనే మూవీ ద్వారా వెండితెరకు పరిచయమై 'మిన్నల్ మురళి', 'తీపొరి పెన్ని', 'శేషం మైఖేల్ ఫాతిమా' వంటి చిత్రాల్లో నటించిన ఫెమీనా జార్జ్‌ను కూడా ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికచేశారు.. విజన్ సినిమా హౌస్ పతాకంపై రూపుదిద్దుకునే ఈ చిత్రాన్ని డాక్టర్ అరుళానంద్, మ్యాథ్యూ అరుళానంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వీరిద్దరూ గతంలో 'జో', 'కోళిపన్నై చెల్లదురై' వంటి హిట్ చిత్రాలను తెరకెక్కించగా, ఇపుడు ఏగన్ హీరోగా తమ మూడో చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'ఆహా కళ్యాణం' అనే సినిమాకు దర్శకత్వం వహించిన యువరాజ్ చిన్నస్వామి దర్శకత్వం వహించే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు నగరంలో తాజాగా జరగ్గా ఇందులో చిత్ర బృందం పాలొంది. అలాగే, ఇందులో నటించే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.


ఏగన్ - ఫెమీనా జార్జ్

నయనతారకు భర్త బర్త్‌డే గిఫ్ట్

● బహుమతిగా రూ.10 కోట్ల లగ్జరీకారు

అగ్రహీరోయిన్ నయనతార తన 41వ పుట్టిన రోజు వేడుకలను ఈ నెల 18వ తేదీన జరుపుకోగా, ఈ సందర్భంగా ఆమె భర్త, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్ ఖరీదైన లగ్జరీ కారు బహుమతిగా ఇచ్చారు. రోల్స్ రాయిస్ బ్లాక్ బ్యాడ్జ్ స్పెక్టర్‌ను నయనకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఇచ్చి విషెస్ చెప్పారు. ఈ కారు విలువ రూ.10 కోట్లు ఉంటుందన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం. 2023లో నయనకు మెర్సిడెస్ మేబాచ్ కారును, 2024లో మెర్సిడెస్ బెంజ్ మేబ్యాక్ జీఎల్ఎస్ 600 కారు బహుమతిగా ఇచ్చారు. కాగా, 41వ వసంతంలోకి అడుగుపెట్టిన నయనతారకు పలువురు సినీ ప్రముఖులు, సహచర నటీనటులు సోషల్ మీడియా వేదికగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



లగ్జరీ కారు పక్కన నయనతార ఫ్యామిలీ

తప్పుడు వార్తలు ప్రచారం చేయొద్దు

● మాన్య ఆనంద్

హీరో ధనుష్, ఆయన మేనేజర్ శ్రేయాస్‌కు వ్యతిరేకంగా తాను మాట్లాడినట్టుగా సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారానికి యువ నటి మాన్య ఆనంద్ ఫుల్‌స్టాప్ పెట్టారు. వారిద్దరి గురించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తనను లక్ష్యం చేసుకోవద్దని కోరారు. ఇటీవల ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'ధనుష్ మేనేజర్ శ్రేయాస్ అనే పేరుతో ఒక వ్యక్తి తనతో అసభ్యంగా మాట్లాడారని, అలా మాట్లాడింది ఆయనేనా అనే సందేహం కలుగుతోందన్నారు. ఈ వీడియో కొన్ని నిమిషాల్లో వైరల్ అయింది. దీంతో పలువురు నెటిజన్లు ధనుష్, ఆయన మేనేజరు శ్రేయాస్‌లపై విమర్శలు గుప్పించారు. ఇది పెద్ద వివాదానికి దారితీసేలా కనిపించడంతో మాన్య ఆనంద్ స్పందించారు. 'నేను ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని విష ప్రచారానికి తెరలేపారు. నన్ను సంప్రదించిన వారు శ్రేయాస్ అని నమ్మించే ప్రయత్నం చేశారని చెప్పాను. అతనే శ్రేయాస్ అని నేను ఎక్కడా చెప్పలేదు. తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దు' అని పేర్కొన్నారు.




తిరువణ్ణామలై జిల్లాలోని పర్వతమలై శిఖరం

పర్వతమలై, చదురగిరికి రోప్‌కార్ సేవలు

● త్వరలో ప్రాథమిక పరిశీలన

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పర్వతమాలా ప్రయోజన సంస్థ నేషనల్ రోప్ వేస్ డెవెలెప్‌మెంట్ ప్రోగ్రాం కింద రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో ఆధునిక వసతులకు బృహత్తర పథకం రూపొందించింది. ప్రముఖ శివాలయాలున్న తిరువణ్ణామలై జిల్లాలోని పర్వతమలై, అదే విధంగా మదురై జిల్లాలోని చదురగిరి, తెన్‌కాశిలోని తోరణమలై మురుగన్ ఆలయం, కురంగణి హిల్ స్టేషన్, ప్రముఖ వేసవి విడిది కేంద్రంగా పేరొందిన ఊటీలోని క్రౌన్ మోర్గాన్ సింగా పవర్‌హౌస్‌లకు వెళ్లే మార్గాలకు 0.5 కిలోమీటర్ల నుండి 4.6 కిలోమీటర్ల వరకు రోప్‌కార్ సేవలు ప్రారంభించేందుకు ప్రాథమిక పరిశీలన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా జాతీయ రహదారుల సంస్థ, చెన్నై మెట్రో రైల్వేసంస్థలోని నిపుణుల బృందాలు రోప్‌కార్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నాయి. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు ప్రముఖ ఆధ్మాతిక పర్యాటక కేంద్రాలను విలీనం చేస్తూ కేబుల్‌కార్, రోప్‌కార్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. అదేవిధంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రపంచంలో అతిపొడవైన, రెండవదిగా గుర్తింపు పొందిన మెరీనా సముద్ర తీరం అందాలను ఆకాశంలో విహరిస్తూ ఆస్వాదించేలా ఆధునిక రోప్‌వే నిర్మాణం పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

మదురై జిల్లాలో చదురగిరికి వెళ్లే మెట్లమార్గం



క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రాముఖ్యం


ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి పుస్తకం అందజేస్తున్న వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగంలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి విజ్ఞప్తి చేశారు. వీఐటీ చెన్నై వర్శిటీ ప్రాంగణంలో బుధవారం స్థానిక, పట్టణ సంస్థలకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి... రూ.100 కోట్లతో చేపట్టిన 'డా.కలైంజర్ క్రీడా పరికరాల పథకం' ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలైంజర్ కరుణానిధి మంచి క్రీడాభిమాని అని, క్రీడలపై ఆయనకు ఉన్న ప్రేమ కారణంగా ఆయన పేరు మీద ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారు క్రీడల్లో విజయాలు సాధించేలా డీఎంకే నేతృత్వంలోని ద్రావిడ నమూనా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించిన 100 మంది క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. గత ఏడాది 12,500 గ్రామాలకు క్రీడా సామగ్రి అందించామని తెలిపారు. ప్రతి ఒక్కరిలో ఐక్యత, సోదరభావం పెంపొందించడానికి క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యమని, క్రీడల విషయంలో కులం, మతాలకు తేడా లేదని, అదే క్రీడల గొప్ప శక్తి అని ఉదయనిధి తెలిపారు.

రేలా హాస్పిటల్‌లో వరల్డ్ ప్రీ మెచ్యూరిటీ డే

● చిన్నారుల సందడి


చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే సందర్భంగా బుధవారం ఉదయం ప్రసవ కాలానికి ముందుగా, తక్కువ బరువుతో జన్మించి, ఆ హాస్పిటల్‌లో చికిత్స పొందిసంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న 50 మంది బాలబాలికలు, వారి తల్లిదండ్రులతో ఓ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులు ఆడుతూ పాడుతూ సందడి చేశారు. రేలా హాస్పిటల్ ఛైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రముఖ సినీ నటుడు రవి మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆస్పత్రికి చెందిన వైద్యనిపుణులు డాక్టర్ నరేష్ షణ్ముగం, డాక్టర్ వేల్‌మురుగన్ కన్నప్పన్, డాక్టర్ ఎంపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మహమ్మద్ రేలా మాట్లాడుతూ నెలలు నిండకుండా, తక్కువ బరువుతో పుట్టే చిన్నారులను కాపాడటంతో వైద్యులకు సవాలుతో కూడుకున్న పని అని తెలిపారు. ఇలా తక్కువ ప్రసవ కాలంలో జన్మించే వారి కోసమే ప్రతియేటా నవంబరు 18న 'వరల్డ్ ప్రీ మెచ్యూరిటీ డే'గా జరుపుకుంటున్నామని తెలిపారు.



చిన్నారులతో నటుడు రవి మోహన్, మహమ్మద్ రేలా తదితరులు

వీరరాఘవుడి సన్నిధిలో అమావాస్య పూజలు

తిరువళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులోని వీరరాఘవ స్వామి ఆలయంలో కార్తీక అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య రోజున పితృదేవతలకు పిండ ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తుంది. దీని కోసం వీరరాఘవస్వామి ఆలయానికి జిల్లాతో పాటు చెన్నై, కాంచీపురం, వేలూరు, తిరువణ్ణామలై, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది మంది భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కోనేరు పరిసరాల్లో పితృదేవతలకు తర్పణాలు వదిలారు. వేలాది మంది భక్తులు రాత్రి బస అనంతరం పిండప్రదానం చేసి, వేకువజామున స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి భక్తులతో ఆలయ పరిసర ప్రాంతం నిండిపోయింది.


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వీరరాఘవ స్వామి

కేటీసీటీలో పూర్వ విద్యార్థినుల సందడి


విజేతలతో లత బాలాజీ, కె.అనిల తదితరులు

ప్యారీస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కేటీసీటీ బాలికల ప్రాథమిక, హైయ్యర్ సెకండరీ పాఠశాల ఆడిటోరియంలో కేటీసీటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాలల, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు లత అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, స్వీట్లు బహూకరించారు. అదే విధంగా, ఉపాధ్యాయులకు కూడా ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వేడుకల్లో భాగంగా, టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థినుల అల్పాహారం కోసం నారాయణ గురవయ్య చెట్టి ఛారిటీస్ అందజేసిన రూ.10 వేలు పూర్వ విద్యార్థినుల సంఘం తరపున పాఠశాలకు విరాళంగా అందించారు. కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అనిల స్వాగతం పలికిన ఈ వేడుకల్లో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సంఘ కార్యదర్శి మాలతి, కోశాధికారి భాను, కార్యవర్గ సభ్యులు మల్లిక, లీలారాణి, సరళ, అనిల, ప్రసన్న, భారతి, లక్ష్మి, మల్లీశ్వరి, పూర్వ విద్యార్థి కస్తూరి తదితరులు హాజరయ్యారు.


సదస్సులో మంత్రి గణేశన్, అతిథులు, నిర్వాహకులు

సెక్యూరిటీ గార్డుల సేవలు మరువలేనివి

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కర్మాగారాలు ఇలా పలు ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డులు అందిస్తున్న సేవలు మరువలేనివని రాష్ట్ర కార్మిక సంక్షేమం, వృత్తి నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి సీవీ గణేశన్ తెలిపారు. 'ది సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ(సీఏపీఎస్) ఆధ్వర్యంలో ఐఐటీ మద్రాసు రీసెర్చి పార్క్‌లో రెండు రోజలు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి గణేశన్ మాట్లాడుతూ... ప్రస్తుతం భద్రత, రక్షణ కల్పించే బాధ్యతల్లో ప్రైవేటు సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయని కొనియాడారు. కొవిడ్ కాలంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు చేసిన సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సంక్షేమానికి ముఖ్యమంత్రితో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఏపీఎస్ ఛైర్మెన్ కున్వర్‌విక్రమ్ సింగ్, తమిళనాడు చాప్టర్ ప్రెసిడెంట్ నెవిల్ రాయన్ సహా పలు రాష్ట్రాల ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 12 వినతులు

పెరంబూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 12 వినతులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం జరిగే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

డీఎంకే హయాంలోనే మైనార్టీలకు ప్రత్యేక పథకాలు

తిరువళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందని తమిళనాడు వక్ఫ్ బోర్డు సభ్యుడు డాక్టర్ ఎ. సుబేర్ ఖాన్ తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుబేర్ ఖాన్ అధ్యక్షతన బుధవారం తిరువళ్లూరు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైనార్టీల సంక్షేమానికి సీఎం స్టాలిన్ ప్రాధాన్యమిస్తూ, వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మహిళ స్వయం సహాయక సంఘం ద్వారా 9 మంది లబ్దిదారులకు రూ.1.80 లక్షలు, క్రైస్తవ మహిళ స్వయం సహాయ సంఘం సభ్యులు ఐదుగురికి రూ. 30 వేల విలువైన సహాయకాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సురేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఉషారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న వక్ఫ్ బోర్డు సభ్యుడు సుబేర్ ఖాన్

నా భర్త కల నెరవేరుస్తా

● దివంగత నటుడు వివేక్ సతీమణి


అరుల్ సెల్వి

అడయార్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోటి మొక్కలు నాటాలన్న తన భర్త, ప్రముఖ సినీ హాస్య నటుడు దివంగత వివేక్ కలను త్వరలోనే నెరవేర్చుతామని ఆయన సతీమణి అరుల్‌సెల్వి వెల్లడించారు. దివంగత నటుడు వివేక్ 65వ జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా నగరంలో తొమ్మిది ప్రాంతాల్లో ఆయన అభిమానులు మొక్కలు నాటారు. ఇందులో వివేక్ సతీమణి అరుల్‌సెల్వి కూడా పాల్గొని మొక్క నాటారు. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ, తన భర్త వివేక్ పర్యావరణ ప్రేమికుడని, ఆయన కోటి మొక్కలను నాటాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కానీ ఆ లక్ష్యం నెరవేరకుండానే ఆయన భౌతికంగా దూరమయ్యారని గుర్తు చేశారు. ఇపుడు తన భర్త కలను నెరవేర్చేలా కోటి మొక్కలను నాటి ఆ కలను నెలవేర్చుతామని ఆమె వెల్లడించారు.

ప్లకార్డ్ చూసి మురిసిన మోదీ

చెన్నై, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సేంద్రియ వ్యవసాయ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా ఇద్దరు బాలికలు ప్రదర్శిస్తున్న ప్లకార్డ్‌ను చూసి మురిసిపోయారు. ప్రధాని మోదీ ఆర్థికాభివృద్ధికి చేపడుతున్న చర్యలను ప్రశంసించేలా ఆ ప్లకార్డులో ఆంగ్లంలో వాక్యాలు ఉన్నాయి. ఆ ప్లకార్డ్ చూసిన మోదీ హిందీలో ప్రసంగిస్తుండటం ఆపి ఆ ప్లకార్డ్‌ను తనకు అందించమంటూ సెక్యూరిటీ సిబ్బందికి ఆంగ్లంలో ఆదేశాలిచ్చారు. ఆ ఇద్దరు బాలికలు సెక్యూరిటీ సిబ్బందికి ఆ ప్లకార్డు అందజేశారు. అదే సమయంలో మోదీ మాట్లాడుతూ ఆ ప్లకార్డులో ఉన్న విషయాన్ని పరిశీలించి అందుకు తగ్గట్లే చర్యలు చేపడతానన్నారు. ఇంతకీ ఆ ఆ ప్లకార్డులో ఏముందుంటే... 'దేశం ఆర్థికపరంగా ద్వితీయశ్రేణిలో ఉన్నప్పుడు పట్టభద్రురాలినవుతాను. అదే విధంగా దేశం ఆర్థికపరంగా ప్రథమ శ్రేణిలో ఉన్నప్పుడు పదవీ విరమణ చేయబోతున్నాను. మీ దూరదృష్టికి మా ధన్యవాదాలు' అని ఉంది. ఆ ఆంగ్ల వ్యాక్యాలను చూసి మోదీ మురిసిపోయారు.



ప్లకార్డు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న దాత

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తమిళనాడులోని వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళి వెంకటసుబ్బు తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి విరాళం డీడీని అందజేశారు.



తిరుమలలో పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి డిప్యూటీస్పీకర్ రాజవేలు బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

→ రాజవేలు

విద్యాశ్రీషతీర్థ స్వామికి పెద్ద మర్యాద



టీటీడీ పెద్ద మర్యాదతో వ్యాసరాయ మఠాధిపతి విద్యాశ్రీషతీర్థ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అర్చక బృందంతో కలిసి ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకిలో తీసుకెళ్లిన శఠగోపాన్ని అందుకున్న అనంతరం స్వామిజీ మంగళవాయిద్యాలతో తన శిష్యబృందంతో కలిసి ఆలయంలోకి వెళ్లారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,966

తలనీలాలు సమర్పించినవారు: 21,535



సాంస్కృతిక వైభవం




భారతదేశం అంటే విభిన్న సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు. దేశంలో ఏ మూలకు వెళ్లినా ఏదో కొత్త సంస్కృతి మనల్ని పలకరిస్తుంది. పదుల సంఖ్యలో విభిన్న సంస్కృతులు ఒకే చోట చూసేందుకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వేదికగా నిలుస్తున్నాయి. ఆయా వాహనాల ముందు దేశ నలుమూలల నుంచి వచ్చిన కళాబృందాల ప్రదర్శనలు భక్తుల మనసును దోచుకుంటున్నాయి. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 15 కళా బృందాలు ఉదయం, రాత్రి అమ్మవారి వాహన సేవల ముందు చేస్తున్న కళారాధన భక్తులను ఆకట్టుకుంటోంది. ఒక పూటకు సుమారు 500మంది కళాకారులు వాహన సేవలో పాల్గొంటారు. ఏపీ నుంచి కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, మహారాష్ట్ర నుంచి పాండురంగ నృత్యం, కేరళ నుంచి డ్రమ్స్, మణిపూర్ సాంప్రదాయ నృత్యాలు అమ్మవారి వాహనసేవలో కళారాధన చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ యేడాది తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ, గిరిజన తెగలు, ఆదివాసీలు పండుగ పబ్బాల్లో చేసే గుస్సాడీ, లంబాడీ, కోయ, గోండు నృత్యాలు జానపద కళా రూపాలను ప్రతిబింబిస్తున్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



'సివిల్స్' ఉచిత కోచింగ్‌కు

దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్ష-2026కు సంబంధించి ఉచిత కోచింగ్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు అత్యుత్తమ కోచింగ్, పుస్తకాలు, భోజనం, వసతి ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటికోసం ఈ నెల 26వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఘాట్‌రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామికి

ప్రత్యేకాభిషేకం


భక్తులకు అన్నప్రసాదం పెడుతున్న అదనపు ఈవో

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అలిపిరి కాలినడకమార్గంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీవారి ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంను అదనపు ఈవో సన్మానించారు.

ర్యాపిడో పేరుచెప్పి బైకులో తీసుకెళ్లి

- భక్తుడిపై మందుబాబుల దాడి
- మెడలో ఉన్న గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో.. అంటూ బైకులో ఎక్కించుకున్నాడు. దూరంగా పొదల్లోకి తీసుకెళ్లి మరికొందరు మందబాబులతో కలిసి ఆ భక్తుడిపై దాడిచేసి బంగారు గొలుసు లాక్కెళ్లారు. తిరుపతిలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అలిపిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీకాకుళంకు చెందిన శ్రీధర్, నెల్లూరు వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్న ఓ కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనం కోసం రెండు రోజుల క్రితం తిరుమలకు వచ్చారు. అక్కడ దర్శనం చేసుకుని ఉపాధ్యాయనగర్‌లో రూము అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత నెల్లూరుకు చెందిన భక్తులు వెళ్లిపోయారు. శ్రీధర్ మాత్రం రైల్వే స్టేషన్‌కు వెళ్ళడానికి ఉపాధ్యాయ నగర్‌లోని బస్టాపు వద్ద నిలబడి ఉన్నారు. ఇతడిని గమనించిన ఓ వ్యక్తి రాపిడో పేరుతో మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకున్నాడు. కొంతదూరంలోని ముళ్లపొదల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మద్యం తాగుతున్న తన స్నేహితులతో కలిసి శ్రీధర్‌పై దాడి చేశారు. అతడి మెడలో వున్న దాదాపు నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుడి కేకలతో స్థానికులు వచ్చారు. వీరిచ్చిన సమాచారంతో అలిపిరి ఎస్ఐ లోకేష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఐదుగురు పరారయ్యారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


సమాపనోత్సవంలో పాల్గొన్న పద్మావతి, ద్రవిడ యూనివర్సిటీల వీసీలు ఉమ, దొరస్వామి తదితరులు

● సామాన్య ప్రజల చెంతకు

పుస్తక విజ్ఞానాన్ని చేర్చాలి

లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో వక్తల మనోభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుస్తక విజ్ఞానాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత గ్రంథాలయాలపై ఉందని పలువురు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రంథాలయాల పాత్ర'పై మూడు రోజులుగా ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో చేపట్టిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) సలహాదారు డాక్టర్ జగదీష్ అరోరా మాట్లాడుతూ.. కాలానుగుణంగా గ్రంథాలయాలను సాంకేతికరించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు తమవంతు పాత్రను పోషించాలని కోరారు. శిథిలమవుతున్న పుస్తకాలను డిజిటలైజ్ చేయాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ వెన్నం ఉమ కోరారు. తద్వారా ఆయా పుస్తకాల్లోని విలువైన విజ్ఞానాన్ని భవిష్యత్తుతరాలకు అందించాలన్నారు. ఎస్వీయూ రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. లైబ్రరీ సైన్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో పురోగతిని సాధించిందన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో చదువుకున్న వారు ప్రస్తుతం దేశ, విదేశాల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నారన్నారు. ఇన్‌ప్లిబ్‌నెట్ జాయింట్ కన్వీనర్ రాజా మాట్లాడుతూ.. విజ్ఞానానికి సాంకేతికతను జోడించాలని సూచించారు. పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ సేవుకన్ మాట్లాడుతూ.. పరిశోధనల్లో ప్రమాణాలను పెంచడానికి గ్రంథాలయాలు తోడ్పడాలని కోరారు. అంతర్జాతీయ సదస్సు విజయవంతానికి సహకరించిన వారికి సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ సురేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచీ హాజరై పేపర్, పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్ చేసిన ప్రతినిధులను అభినందించారు. దేశ, విదేశీ ప్రతినిధులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు.

సదస్సు తీర్మానాలివే..

- 2047 నాటికి జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడానికి జాతీయ గ్రంథాలయ విధానాన్ని రూపొందించాలి.
- గ్రంథాలయ అధికారులు, సిబ్బందికి ఇన్-సర్వీస్ శిక్షణను అందించాలి.
- లైబ్రరీ సైన్స్ ఇంటర్న్‌షిప్‌ను క్రమబద్ధంగా నిర్వహించి విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి.
- లైబ్రరీ సైన్స్ పాఠ్యాంశాల్లో మార్పు చేర్పులు చేపట్టాలి.
- పీజీ స్థాయిలో అన్ని సబ్జెక్టుల్లో లైబ్రరీ సైన్స్ పేపర్ పెట్టాలి.
- గ్రంథాలయ పరిశోధన మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.
- ప్లాగరిజంపై అవగాహన పెంచడానికి లైబ్రేరియన్లు-లైబ్రరీసైన్స్ విభాగాలకు ఓరియెంటేషన్ నిర్వహించాలి.
- ఉచితంగా లభించే ప్రచురణలు, స్వయం వంటి ఓపెన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాలి.



ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సమీపంలో బోదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసుల తనిఖీల్లో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టుచేసి 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐలు వినోద్‌కుమార్, లింగాధర్ బృందాలు బుధవారం తెల్లవారుజామున కడివేడు ఫారెస్టు బీట్ పరిధిలోని బోదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వస్తున్న కారు.. పోలీసులను గమనించి కొద్దిదూరంలో ఆగింది. అందులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.పట్టుబడ్డ స్మగ్లర్లను, దుంగలతో సహా కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుగా మారి.. నాట్లేసి

కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం పెళ్లకూరు మండలం దిగువ చావాలి గ్రామం వద్ద పొలాల్లో వరి నాట్లు వేసి కర్షకుల్లో నూతనోత్సాహం నింపారు. నాయుడుపేటలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యంలో దిగువ చావాలి గ్రామం వద్ద ఆగారు. పొలాల్లో కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. రైతులు, కూలీలతో మాట్లాడారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలిస్తూ అధిక దిగుబడులు పొందేలా పని చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ సమస్యలపై రైతులిచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి


వరినాట్లు వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

జీవాలు, నాటుకోళ్ల పెంపకంతో రెట్టింపు ఆదాయం

● వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పాడి, పాల ఉత్పత్తుల తయారీ, జీవాలు, నాటుకోళ్ల పెంపకాన్ని చేపట్టడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి పెంపకం, విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీ, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, పోషణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ లైవ్ స్ట్రీమింగ్ ప్రోగ్రామ్‌ను రైతులు వీక్షించే ఏర్పాట్లు చేశారు. వెటర్నరీ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీఈ బి.శోభామణి, డెయిరీ టెక్నాలజీ అసోసియేట్ డీన్ జి.గంగరాజు, సీసీవీఈసీ కోఆర్డినేటర్ కె.సుజాత, వివిధ విభాగాల అధ్యాపకులు, రూరల్ మండల వెలుగు ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

వినియోగంలో లేని బ్యాంకు ఖాతాల నుంచి

మీ నగదు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లగా బ్యాంకు ఖాతాల్లో ఏ విధమైన ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఉన్న మీ నగదును తిరిగి పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. 'మీ డబ్బు- మీ హక్కు' గోడపత్రికలను గురువారం అయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మీ డబ్బు మీ హక్కు అనేనినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రజలుతమ పేర్ల మీద ఉన్న ఖాతాల్లో పదేళ్లుగా లావాదేవీలు జరపని నగదును పొందని ఎడల ధృవీకకరణపత్రాలు తీసుకుని మీ నగదు, ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం రిజర్వు బ్యాంకు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో గడచిన పదేళ్లగా ఎలాంటిఆర్థిక లావాదేవీలు జరపకుండా 5,50,632ఖాతాలోల రూ.112.42కోట్లు నిల్వ ఉంద్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరురవికుమార్, మధుసూదన్, చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.